క్లుప్తంగా

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి. బాలగంగాధర్ 38వ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో బాలగంగాధర్ అభినందన కార్యక్రమం జరిగింది. రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పలు పతకాలు సాధించిన బాలగంగాధర్ జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తాచాటి కళాశాల పేరు ప్రఖ్యాతలు ఇనుమడింప చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ఆకాంక్షించారు. అనంతరం కళాశాల సిబ్బందితో కలిసి బాలగంగాధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ డి. యుగంధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో సిద్ధాంత పండిత సభ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ కంచి కామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ ఆదేశానుసారం ఈ నెల 25, 26వ తేదీల్లో గుంటూరు జిల్లా కొలనుకొండలోని కంచి కామకోటిలో సిద్ధాంత పండిత సభను నిర్వహించనున్నట్లు కంచికామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రధానంగా ఉత్తరాయణ ఆరంభ నిరూపణం అనే అంశంపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ముంబై తదితర రాష్ట్రాల నుంచి కొందరు ప్రత్యక్షంగానూ, మరికొందరు ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటారని తెలిపారు. జ్యోతిష్య ఖగోళ పరిశోధనలపై ఆసక్తి కలిగిన పండితులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి కోరారు. పూర్తి వివరాలకు 99637 32303 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మధురంగా సాగిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: గోమయి నాదమయి ట్రస్ట్ ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో సోమవారం చెన్నైకి చెందిన యువ సంగీత విద్వాంసుడు డాక్టర్ ఆర్. సూర్యప్రకాష్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత మూర్తిత్రయం శ్రీ సద్గురు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి రచించిన కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై పప్పు జయదేవ్, మృదంగంపై పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, కంజీరాపై కె. శ్రీనివాస్ సహకరించారు. ట్రస్ట్ సభ్యుడు వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి సంగీత విద్వాంసుడు సూర్యప్రకాష్ గురించి మాట్లాడుతూ ఎనిమిది ఏళ్ల వయస్సు నుంచే సంగీత సాధన ప్రారంభించారని.. విఖ్యాత సంగీత విద్వాంసుడు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ నుంచి గానకళామధుర, తమిళనాడు ప్రభుత్వం నుంచి కలైమామణి, మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వారి నుంచి ఉత్తమ సంగీత విద్వాంసుడు బిరుదు పొందినట్లు తెలిపారు. మరొక నిర్వాహక సంఘ సభ్యుడు జె.ఎస్. దక్షిణామూర్తి సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్, మల్లాది సూరిబాబు, మల్లాది కార్తీక త్రివేణి పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామికి సప్తస్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పడమట దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. సోమవారం కార్యక్రమాలు హరిద్రా మ్యూజిక్ అకాడమీ బృందం, పామర్తి కార్తీక, విజయనగరానికి చెందిన చొప్పల్లి సంతోష్‌కుమార్, భాగవతుల వంశీకృష్ణ శివాత్మిక, హైదరాబాద్‌కు చెందిన పూడిపెద్ది రాధాకృష్ణ, నోరి సోదరీమణులు, మల్లాది కార్తీక త్రివేణి, తుషార పూర్ణవల్లి తదితరులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. యువ సంగీత కళాకారుడు ఎస్.వనమాలి వేణువుపై త్యాగరాజ స్వామి రచించిన శ్రీగణనాథం, నిరవది సుఖదా, మారవైరి, నీవల్లగుణదోషమేమి తదితర కీర్తనలు పలికించారు. వయోలిన్‌పై సుబ్రహ్మమణ్యరాజు, మృదంగంపై వినుష్ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు యనమండ్ర శ్రీనివాస శర్మ, యనమండ్రవేణు గోపాల శాస్త్రి పర్యవేక్షించారు.

రేపు అక్కినేని వర్ధంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సాంస్కృతిక సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యాన బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వీధి కుక్కల స్వైర విహారం

- గుంపులు గుంపులుగా తిరుగుతున్న వైనం
- ఒంటరిగా కనిపిస్తే దాడే
- ఆసుపత్రులకు క్యూ కడుతున్న జనం



చిట్టినగర్ సెంటర్‌లో వీధికుక్కలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పగలు లేదు.. రాత్రి లేదు.. ఎప్పుడు చూసినా కుక్కల అరుపులు, ఏడుపులతో స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిట్టినగర్ పరిధిలోని కొత్తపేట ఆంజనేయ వాగు, సొరంగం రోడ్డు, టేనర్‌పేట అడ్డరోడ్డు, లంబాడీపేట, కేఎల్‌రావునగర్ ఇలా ఒకటేమిటి ఎక్కడ చూసినా ఇదే తంతు.... ఏ ఇద్దరి ఒకే చోట కలిసినా కుక్కల గురించే చర్చ... అక్కా కాస్త చూసుకుని వెళ్లు.. సందు చివరన కుక్కలున్నాయని జాగ్రత్తలు చెప్పుకునే వారే ఆయా ప్రాంతాల్లో కనిపిస్తున్నారు. వీధి కుక్కలు దాడి చేసి గాయపరచడంతో బాధితులు వైద్యం కోసం షేక్. రాజా ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. నాలుగు డోసుల్లో ఇంజక్షన్లు తీసుకోవడం, అప్పటి వరకు పత్యం చేయడం అంటే కూలీ, చిన్నపాటి పనులు చేసుకునే పేద, సామాన్య ప్రజలకు కష్టంగా మారుతుంది. నగర పాలక సంస్థ వీధి కుక్కలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వీధి కుక్కలను నియంత్రించాలనే భావనతో వాటిని పట్టుకున్న కార్పొరేషన్ సిబ్బంది కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి తిరిగి వదిలిపెట్టేశారు. అయితే ఇటీవల కాలంలో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలతో కలిసి సంతానోత్పత్తిని ప్రారంభించాయి. వాటిని పెంపుడు కుక్కల యజమానులు వీధుల్లోకి వదిలేయడంతో తిరిగి కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోయింది. గతంలో వీధి కుక్కలను పట్టుకుని నగరానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో విడిచి పెట్టేవారు. ఇటీవల వీధి కుక్కలను ఓ దఫా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిన రెండు, మూడు రోజులకే తిరిగి అవి మళ్లీ వీధుల్లో దర్శనమిస్తున్నాయి.



వీధి కుక్క దాడిలో గాయాలను చూపుతున్న వృద్ధురాలు

చేతిలో కవరు కనిపిస్తే చాలు.....

ఆదివారం, పండుగల వేళ చేతిలో ఏదైనా కవరు పట్టుకుని నడుచుకుంటూ వచ్చామా అంటే కుక్కలు వెంటపడినట్లే. మూడు, నాలుగు కుక్కలు చుట్టూ చేరి చేతిలోని సంచి కవరును లాక్కునేంత పని చేస్తున్నాయి. పోనీ చేతిలో ఉన్న సంచితో కుక్కలను బెదిరిందామనుకున్నా... కొడదామన్నా.... తినే ఆహారం ఎక్కడ నేల పాలవుతుందోనని ఆందోళన. కేవలం వీధి కుక్కలే కాకుండా అరోగ్యం సరిగా లేని పెంపుడు కుక్కలను సైతం వీధుల్లో వదిలేస్తున్నారు. గడిచిన వారంలో చిట్టినగర్ పరిధిలో పది మందికి పైగా కుక్కలు దాడి చేయడంతో గాయాల పాలైన వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు.



వారం రోజుల కిందట చిన్నారికి అయిన గాయం

కుక్కలతో రోడ్డు ప్రమాదాలు...

వీధి కుక్కలు దాడి చేసి గాయపరచడం ఒక వంతయితే... వీధి కుక్కలతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. రోడ్డు పక్కన నిలిపి ఉంచే ద్విచక్ర వాహనాలు, ఆటోల కింద పడుకునే వీధి కుక్కలు.. మరో కుక్క కనిపించగానే వేగంగా రోడ్డుకు అడ్డుగా పరుగు తీస్తుంది. దీంతో రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనాలు ఆ కుక్కలను ఢీకొని ప్రమాదాలకు గురైన ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

ఇంటికో కుక్క...

ఇటీవల ఇంట్లో జంతువులను పెంచడం చాలా మందికి హాబీగా మారింది. అయితే కుక్కలు, పిల్లులు, పక్షులను ఎక్కువగా పెంచుతుంటారు. అయితే గత కొన్ని ఏళ్లగా కుక్కలను పెంచేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. ఇంట్లో చిన్న పిల్లగా ఉన్న కుక్కను పెంచడం పెద్ద కష్టమేమి కాదు. కొన్ని నెలలు గడిచిన తర్వాత ఆ కుక్క పిల్ల పెద్దదయితే అప్పటి నుంచి కష్టాలు మొదలయినట్లే. వాటికి కాలకృత్యాలు తీర్చేందుకు వీధి చివరి వరకు తీసుకువెళ్లడం... ఆ క్రమంలోనే కుక్కలు ఎవరో ఒకరిపై దాడి చేసి గాయపరచడం పరిపాటిగా మారింది.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి సూచించారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం దాసరి కళాపీఠం తొమ్మిదవ వార్షికోత్సవం, సినీ సంగీత విభావరి, గాయని రత్నకుమారికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ దాసరి కళాపీఠం చేస్తున్న సేవలను అభినందించారు. దాసరి కళాపీఠం అధ్యక్షుడు దాసరి వెంకటరమణ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు మూర్తి రాజు మాట్లాడుతూ దర్శకుడు దాసరి నారాయణరావు ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించి దర్శకత్వం వహించినట్లు తెలిపారు. అనంతరం సీనియర్ గాయని రత్నకుమారిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ప్రసూనారామన్, టీ శ్రీనివాస రెడ్డి దాసరి సినీ రంగసేవలను వివరించారు. డేవిడ్‌రాజు, రత్నకుమారి, సయ్యద్ ఆలీ, బెల్లంకొండ భారతి, సుశీల్‌కుమార్ చిత్ర గీతాలను ఆలపించారు.

సామాజిక స్పృహ ఉన్న చిత్రకారులకు గుర్తింపు



జగన్‌మోహన్‌రావును సత్కరించి అభినందిస్తున్న ఆకుల, ప్రత్తిపాటి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోకుండా జీవిస్తున్న ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేసి సామాజిక స్పృహతో పెయింటింగ్స్ వేసే చిత్రకారులకు తగిన గుర్తింపు లభిస్తుందని పలువురు కళాభిమానులు పేర్కొన్నారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన చిత్రకారుడు డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు న్యూ ఢిల్లీలోని ది క్రేజీ టేల్స్ సంస్థ పక్షాన 'ఇన్‌ఫ్లుయన్షియల్ ఇండియన్ అవార్డ్', అదే విధంగా కోల్‌కతాకు చెందిన డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ తరుఫున 'పెర్ఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డ్' లభించాయి. ఈ సందర్భంగా హెచ్‌బీకాలనీలోని బొండా ఆర్ట్ గ్యాలరీలో సోమవారం సాయంత్రం ఆయనకు అభినందన సత్కార ం జరిగింది. వైఎస్సార్ సీపీ నేత ఆకుల శ్రీనివాస్ కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కలిసి అవార్డ్స్ గ్రహీత డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావును శాలువాతో సత్కరించి అభినందించారు. ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో కనీస వసతులు లేని కొండ కోనల్లో నివసిస్తూ ఎన్నో అవస్థలు పడుతున్న గిరిజనుల జీవన శైలిపై బొండా జగన్‌మోహన్‌రావు దృష్టి సారించి గీసిన చిత్రాలలో జీవకళ ఉట్టిపడుతుందని కొనియాడారు. ఆయన కుంచె నుంచి వెలువడిన వర్ణచిత్రాలు ఇంద్రధనస్సును తలపిస్తున్నాయన్నారు. ప్రత్తిపాటి శ్రీధర్ మాట్లాడుతూ చిత్రకారుడు జగన్‌మోహన్‌రావు తాను చిత్రించిన పెయింటింగ్స్‌తో ఏర్పాటు చేసిన ఈ ఆర్ట్ గ్యాలరీ చూస్తుంటే ప్రతి పెయింటింగ్ ఒక ప్రత్యేకతను సంతరించుకోవడం అభినందనీయమన్నారు. డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తున్న గిరిజనుల బతుకులు బాగుపడాలన్న లక్ష్యంతోనే వారి దయనీయ పరిస్థితులపై పెయింటింగ్స్ వేస్తున్నానని చెప్పారు. గిరిజనుల జీవితాలు మెరుగుపడాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో అల్లం పూర్ణచంద్రరావు, పీవీ నాగరాజు, కళాకారుడు దామోదర గణపతిరావు, అనిల్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజిని అరికట్టండి సారూ !



లీకవుతున్న పైప్ లైన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో గత కొన్ని నెలలుగా నెలకొని ఉన్న వాటర్ పైప్ లైన్ లీకేజిని అరికట్టాలని స్థానికులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ వాటర్ సప్లై విభాగం అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లామని అయినా పట్టించుకున్న నాథుడే లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వాటర్ పైప్ లైన్ తాగునీటి సరఫరాకు సంబంధించినది కాదని, పాలఫ్యాక్టరీకి చెందిన పైప్‌లైన్ అని కొందరు చెబుతున్నారు. విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోగల డాక్టర్ కెఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి కుమ్మరిపాలెం సెంటర్ అంబేడ్కర్ రోడ్, కబేళా సెంటర్ మీదుగా పాలఫ్యాక్టరీ వరకు వేసిన మెయిన్ లైన్ అని తెలుస్తుంది. వాటర్ పైప్ లైన్ ఎవరిదైనప్పటికీ నాలుగు స్తంభాల సెంటర్‌లోని పెరుమాళ్ల కుటుంబరావు రోడ్‌కు వెళ్లే మలుపులో ఉండటం వలన వాహనాల రాకపోకలన్నీ లీకేజి పైనుంచే సాగుతున్నాయి. తద్వారా అక్కడ పెద్ద గుంత ఏర్పడి రోడ్ కూడా దెబ్బతింటుందని, అక్కడ మరమ్మతులు చేయకపోతే క్రమేపీ గుంత మరింత పెద్దదవుతుందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే మరమ్మతులు చేసి లీకేజిని అరికట్టాలని కోరుతున్నారు.

అమిత్‌షా పర్యటనతో ఏపీకి ఏ మేలు జరిగింది ?

వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో ఏపీకి ఏమి లబ్ధి జరిగిందో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు స్పష్టం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాలే ఉన్నాయని, ఆ క్రమంలో రాష్ట్రానికి వచ్చిన అమిత్‌షా పర్యటనను చంద్రబాబు పూర్తిగా వృథా చేశారని ఆరోపించారు. రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు పూర్తయిందన్నారు. కానీ విభజన హామీల్లోని ఆస్తుల పంపకం, కృష్ణా జలాల వివాదాలు, తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలు తదితర అంశాలపై చర్చించారా లేదో చెప్పాలన్నారు. అలాగే నాగార్జునసాగర్‌ను తెలంగాణ ఆక్రమించి జలాలను అక్రమంగా వినియోగించుకుంటున్న అంశంపై అమిత్‌షాతో చర్చించారా లేదో చెప్పాలని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి ప్రైవేట్‌పరం చేయటం లేదని స్పష్టంగా చెప్పించలేకపోవటంపై ప్రజల్లోనూ, కార్మిక సంఘాల్లోనూ అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు నివసిస్తున్న అక్రమ నిర్మాణంలో అమిత్‌షాతో సమావేశమైన చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నందూరి రాధిక పర్యవేక్షణలో సుమారు 20 మంది చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు వారికి దేవస్థానం తరుఫున ప్రసంసాపత్రం, అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

అర్హులైన పేదలందరికీ పింఛన్లు మంజూరు చేయాలి

– సీపీఎం నగర కార్యదర్శి, కార్పొరేటర్ బోయి సత్య బాబు



పింఛన్లు కోసం ఆందోళన చేస్తున్న ప్రజలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన వృద్ధులు, వితంతు, వికలాంగులు, వృత్తిదారులు, ఒంటరి మహిళలకు తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి బోయి సత్య బాబు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ కార్యక్రమం సందర్భంగా సోమవారం అర్హులతో కలిసి పెన్షన్లు మంజూరు చేయాలంటూ సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల హామీ మేరకు పింఛన్లు మంజూరు చేయాలని ఆందోళన చేశారు. అర్హులైన లబ్ధిదారులతో దరఖాస్తులు చేయించారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు పూర్తయినా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి మంజూరు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. అర్హుల నుంచి కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదన్నారు. ఏ ఆదరణకు నోచుకోని వృద్ధులు, వితంతువులు సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నా సమాధానం చెప్పేవారే లేరన్నారు. దరఖాస్తులు స్వీకరించాలని తమకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని సమాధానం చెబుతున్నారన్నారు. కొత్త పింఛన్లు కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. వెనుకబడిన తరగతులకు 50 సంవత్సరాల వయసు నిండిన వారందరికీ పింఛను మంజూరు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): అధికారుల దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పలువురు వారి సమస్యలను అధికారలు దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో మొత్తం 12 ఫిర్యాదులు రాగా వాటిలో అత్యధికంగా పట్టణ ప్రణాళిక విభాగంపై -5, ప్రజారోగ్యంపై-1, ఇంజినీరింగ్‌పై- 5, రెవెన్యూ విభాగంపై- 1, ఫిర్యాదును ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికారులు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్య కుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల బంగారు భవిష్యత్తే శాప్ లక్ష్యం

శాప్ చైర్మన్ రవినాయుడు



బీచ్ కబడ్డీ జట్టును పరిచయం చేసుకుంటున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర బీచ్ కబడ్డీ పురుషుల జట్టుకు నగరంలోని రివర్‌ఫ్రంట్ పార్క్ వద్ద కృష్ణానది ఇసుక తిన్నెల్లో కోచింగ్ క్యాప్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్‌ను సోమవారం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు ప్రారంభించి మాట్లాడారు. 21 క్రీడాంశాలకు సంబంధించి రాష్ట్ర క్రీడాకారులు ఈ ఏడాది జాతీయ క్రీడల్లో పాల్గొంటున్నారని, వీరందరికీ టీఏ, డీఏ, జెర్సీలు, ట్రాక్ షూట్‌లు, కోచింగ్ క్యాంప్‌ల నగదును శాప్ చెల్లిస్తుందన్నారు. ముందుగా ఈ క్రీడలకు రూ.1.20 కోట్లు అవసరమని అంచనా వేశామని, ప్రస్తుతం రూ.75 లక్షల ఖర్చు తేలుతోందన్నారు. జాతీయ క్రీడల్లో పతకమే లక్ష్యంగా రాష్ట్ర జట్టును తీర్చిదిద్దుతున్నామని ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్(ఏపీవోఏ)కి శాప్ గుర్తింపు లేదని, గుర్తింపు సంఘానికి నిధులు కేటాయించడం వీలుపడదని రవినాయుడు తేల్చి చెప్పారు. జాతీయ క్రీడలకు ఏపీవోఏతో కలిసి శాప్ వెళ్తుందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు చైర్మన్ పై విధంగా స్పందించారు.

తిరుగు పయనం



సంక్రాంతి పండుగ సెలవులు పూర్తి కావడంతో విద్యార్థులు, వివిధ ప్రైవేటు ఉద్యోగులు తిరిగి తమ ప్రాంతాలకు తిరుగు పయనమయ్యారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పండుగకు నగరానికి చేరుకున్న వారంతా మరలా భారంగా తమ ఉద్యోగ ప్రదేశాలకు వెళ్లారు. వేలాది మంది ప్రయాణికులతో బెజవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ కిటకిటలాడాయి. ప్లాట్‌ఫాంలు రద్దీగా మారాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ






